సాక్షి వనపర్తి

శుక్రవారం । 4 । జూలై । 2025



రైతుల ధర్నా

పరిహారం చెల్లించాలంటూ అయిజ మండలం దేవబండ రైతులు రోడ్డుపై బైఠాయించారు.

వివరాలు 4లో ▸



.. సాగని బీటీ పనులు

అమరచింత–మూలమళ్ల బీటీ రహదారి పనులు ఆరేళ్లుగా ముందుకు సాగడం లేదు.

వివరాలు 5లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.5/22.2

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపా దడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ధాన్యం.. దోపిడీ!

జిల్లాలో ముగిసిన యాసంగి కొనుగోళ్లు



'ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ధర్మయ్య. గోపాల్‌పేట మండలం ఏదుట్ల స్వగ్రామం. గతేడాది యాసంగిలో 15 ఎకరాల్లో వరి సాగుచేయగా సుమారు 700 బస్తాల ధాన్యం పండింది. దీనిని గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. తీరా రైస్‌మిల్లుకు తరలించాక తేమశాతం ఎక్కువ ఉందంటూ ఏకంగా 17 క్వింటాళ్ల కోత విధించి అతడి అనుమతి లేకుండానే చెల్లించాల్సిన డబ్బుల్లో రూ.35 వేలు తగ్గించి మిగతావి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయిందని రైతు వాపోయారు. ఇలాంటి ఘటనలు ఒక్కో ఊరిలో పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం.'



- ట్రక్ షీట్ తూకాల్లో కోతలు.. నోరు మెదపని అధికారులు
- మంత్రి ఆదేశించినా.. మారని మిల్లర్ల తీరు
- ప్రతి లారీకి తప్పని వైనం
- లబోదిబోమంటున్న అన్నదాతలు



గోపాల్‌పేట కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు తరలించేందుకు వరి ధాన్యాన్ని లారీలోకి చేర్చుతున్న హమాలీలు (ఫైల్)

వనపర్తి: జిల్లాలో గడిచిన యాసంగిలో వరి ధాన్యం కొనుగోళ్లు రికార్డుస్థాయికి చేరాయి. జూన్ చివరి నాటికి 2.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. మునుపటితో పోలిస్తే.. మిల్లర్లు తూకాల్లో విధించే కోతలు పెచ్చుమీరాయి. విషయం తెలిసినా.. ఫిర్యాదులు అందినా.. అధికారులు కనీసం విచారణకు ఉపక్రమించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించి తూకం చేసి ట్రక్‌షీట్‌లో రైతుల సంఖ్య, మొత్తం తూకం వివరాలు నమోదు చేసి రైస్‌మిల్లుకు తరలిస్తే.. మిల్లర్లు తాలు, తేమశాతం, మట్టిపెడ్డలు, రాళ్లు ఉన్నాయనే కారణాలు చూపి తూకాల్లో కోతలు విధించి రైతులకు చెల్లించాల్సిన నగదు తగ్గించడం పరిపాటిగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రాల నిర్వాహకులు, పౌరసరఫరాలశాఖ అధికారులు, కేంద్రాలు ఏర్పాటు చేసిన శాఖ అధికారులు మిల్లర్లకు వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేస్తున్నారని ఇటీవల గోపాల్‌పేట మండలం ఏదుట్ల రైతులు సుమారు 40 మంది పౌరసరఫరాల కార్పొరేషన్ డీఎం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

సమగ్ర విచారణ జరిపితే..

ధాన్యం కొనుగోళ్ల సమయంలో కలెక్టరేట్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులు, మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులు, అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఆ సమయంలో పలువురు రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి స్పందిస్తూ కేంద్రాల్లో ఒక్కసారి తూకాలు పూర్తి చేశాకా.. మిల్లర్లు కోతలు విధించొద్దని ఆదేశించారు. అయినా మిల్లర్లు, అధికారులు ఆయన ఆదేశాలను బేఖాతరు చేయడం, మార్పులేకపోవడం శోచనీయం. ప్రతి లారీ తూకంలో కోతలు విధిస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నా.. అధికారుల్లో చలనం రాకపోవడం ఏమిటనే ప్రశ్నలు అన్నదాతలు, ప్రతిపక్ష పార్టీల్లో తలెత్తుతున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే.. జిల్లావ్యాప్తంగా గడిచిన యాసంగిలో ఎంత మేర కోతలు విధించారో బహిర్గతం అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

విచారణ చేపడతాం..



ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాక తూకాల్లో కోతలపై పలువురు రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. కొనుగోళ్లు ప్రారంభించినప్పటి నుంచే ఈ విషయంపై దృష్టి సారించాం. ఫిర్యాదులపై స్పందించి కొందరు రైతులకు డబ్బులు ఇప్పించాం. ఇప్పటి వరకు రైతుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి మిగిలిన వారికి కూడా న్యాయం చేస్తాం.

– జగన్మోహన్, డీఎం, పౌరసరఫరాల కార్పొరేషన్, వనపర్తి

కోతలు సరికాదు..



నేను యాసంగిలో రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తే 50 క్వింటాళ్ల ధాన్యం పండింది. కొనుగోలు కేంద్రంలో విక్రయించిన తర్వాత మిల్లుకు తరలిస్తే సుమారు మూడు క్వింటాళ్ల కోత విధించారు. ఇందుకుగాను రావాల్సిన డబ్బుల్లో రూ.ఐదు వేలు తగ్గించి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మేము కష్టపడి పంటలు పండిస్తే మిల్లర్లు ఎలాంటి కష్టం లేకుండా డబ్బులు కొట్టేస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసం.

– ఎల్లస్వామి, రైతు, ఏదుట్ల (గోపాల్‌పేట)

న్యూస్‌రీల్

'సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి'



వనపర్తి రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సాయిలీల అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి మహిళా సంఘాల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణ, గౌరవమైన జీవితం కోసం ఐద్వా నిరంతర పోరాటం చేస్తోందన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ విధానాలు కార్మికులకు వ్యతిరేకంగా, మహిళలకు అన్యాయంగా మారుతున్నాయని, రోజురోజుకు ప్రైవేటీకరణ పెరుగుతుందన్నారు. ఆరోగ్య, విద్య హక్కు, భద్రత మహిళలకు లభించాలంటే పోరాడాల్సిందనని.. ఇందుకు సార్వత్రిక సమ్మె మైలురాయి అవుతుందని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు తగ్గుతుంటే ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి కవిత, సహాయ కార్యదర్శి ఉమా, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రసాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



వనపర్తి రూరల్: పెబ్బేరు మోడల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రాజేశ్వరి, మోక్ష, ధర్మతేజ రాష్ట్రసాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా. టి.నరేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లాలో జరిగే అండర్–15 రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో రాజేశ్వరి, మోక్ష.. నిజామాబాద్ జిల్లాలో జరిగే బాలుర విభాగం పోటీల్లో ధర్మతేజ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ కమలాకర్, అధ్యాపకులు బుచ్చయ్య, మంగమ్మ, హేమలత, సాహిత్య. హఫీజ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కొత్తకోట రూరల్: వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జె.మల్లేశం వార్డెన్లను ఆదేశించారు. గురువారం కొత్తకోట సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు, వంటగది, విద్యార్థుల నివాస గదులు, స్టోర్‌రూంను పరిశీలించడంతో పాటు విద్యార్థుల ప్రవేశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాన్ని అధిగమించేందుకు ఇన్వర్టర్ ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన బోధన, సౌకర్యాలు, నాణ్యమైన భోజనం అందించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయన వెంట వసతిగృహ సంక్షేమ అధికారి ఎస్.సంతోష్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అధికారుల బాధ్యత



మాట్లాడుతున్న సీతాదయాకర్‌రెడ్డి.. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, కమిషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి

వనపర్తి: బాలల హక్కులు పరిరక్షించేందుకు లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు నిబద్ధతతో పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి కోరారు. గురువారం కమిషన్ సభ్యులు కంచర్ల వందనగౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్ కుమార్‌తో కలిసి జిల్లాకేంద్రంలోని బాలల సంరక్షణ కేంద్రం, బాలికల ఉన్నత పాఠశాల, శ్రీరంగాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్య సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత స్త్రీ, శిశు సంక్షేమశాఖ, వైద్య, ఆరోగ్యశాఖపై ఉందన్నారు. పిల్లల్లో లోపాలుంటే ముందుగానే గుర్తించి ఎన్ఆర్సీ కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించి సరైన పౌష్టికాహారం, వైద్యం అందించాలని సూచించారు. అదేవిధంగా ఏదైనా వైకల్యంతో ఉంటే డీఎస్‌టీ పరీక్షలు నిర్వహించి ఫిజియో, స్పీచ్ థెరపీ వంటివి చేయించి సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుందని.. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కచ్చితంగా తినిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహాలు, బాల కార్మికుల కేసుల వివరాలు సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ సమన్వయంతో నిర్వహించడమే గాకుండా యజమానులపై జరిమానాలు విధించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగితే బాధ్యులపై కేసులు చేయడమే కాకుండా పెళ్లి ఆలోచనలు చేస్తున్నప్పుడే ముందుగానే పసిగట్టి అవగాహన కల్పించి నిరోధించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అలాగే పాఠశాలలను తనిఖీ చేసి తీసుకున్న చర్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు.

⇨ జిల్లాలో వయసుకు తగిన బరువు ఎత్తు లేని పిల్లలను అంగన్‌వాడీ కార్యకర్తలు 102 వాహనంలో ఎన్ఆర్సీ కేంద్రానికి తీసుకొచ్చి వారం రోజులు ఉంచి వైద్యం, పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులను చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలను జూనియర్ కళాశాలలో చేర్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగించామన్నారు. ప్రతి గ్రామంలో వీసీపీసీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి నెల మొదటి సోమవారం సమావేశమై బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అనాథ పిల్లలకు మెరుగైన విద్యం అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

⇨ జిల్లాలో బాల్య వివాహాలు జరిగితే కచ్చితంగా కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. పోక్సో కేసులో చార్జిషీట్ నమోదు చేయడమే కాకుండా బాధితులకు సకాలంలో పరిహారం ఇప్పించడంతో పాటు వారికి సపోర్ట్ పర్సన్‌ను నియమించి తగిన ధైర్యం, సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కమిషన్ సభ్యులు కొనియాడారు. అనంతరం జిల్లాలో ఉత్తమ మార్కులు పొందిన అనాథ పిల్లలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీసీపీఓ రాంబాబు, జిల్లా పోలీసు అధికారులు, జిల్లా సంక్షేమశాఖ సిబ్బంది, స్వచ్ఛందసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తుంగభద్రలో ఇసుకతీతకు గ్రీన్‌సిగ్నల్



తుమ్మిళ్లలోని తుంగభద్ర నదిలో బోటు ద్వారా ఇసుక తరలింపు

- ఎట్టకేలకు బోట్ల ద్వారా తోడివేత
- ఉమ్మడి జిల్లాలో తీరనున్న ఇసుక కొరత
- 7.25లక్షల మెట్రిక్ టన్నులు తీసేందుకు అనుమతులు

రాజోళి: తుంగభద్ర నదిలో బోట్ల ద్వారా ఇసుక తీసేందుకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇసుక కొరత తీరనుంది. ప్రభుత్వ పనులతో పాటు ఇతర నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా ఇసుక తీసుకునేందుకు సులభతరమైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండు నదులు ఉన్నప్పటికీ.. ఎక్కువగా ఇసుక లభ్యత ఉండేది తుంగభద్ర నదిలోనే. అయితే తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో తుంగభద్ర నది ఉండటంతో ఇసుక తీసుకునే క్రమంలో తరచు వివాదాలు తలెత్తుతున్నాయి. అనుమతులు ఉన్న వాహనాలకు సైతం ఇసుక లభించేది కాదు. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగి.. సామాన్యులకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే తుంగభద్ర నది నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక తీసుకునేందుకు అనుమతులు వచ్చాయి. దీంతో ఉ మ్మడి జిల్లా ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయి.

బోట్ల సహాయంతో..

నదిలో నీటి ప్రవాహం ఉంటే ఇసుక తోడేందుకు గతంలో కుదిరేది కాదు. కానీ ఏపీ ప్రభుత్వం నదిలో నీరున్నా బోట్ల ద్వారా ఇసుకను తోడుతోంది. ఒక్కోసారి తెలంగాణ సరిహద్దులోకి వచ్చి మరీ తోడుకుంటున్నారు. దీంతో జిల్లావాసులకు ఇసుక లభించడం లేదనే వాదనలు ఉన్నాయి. ప్రస్తుతం బోట్ల ద్వారా ఇసుకను తీసుకునేందుకు అనుమతులు ఇవ్వడంతో తెలంగాణ తరఫున కూడా నదిలో బోట్ల ద్వారా ఇసుకను తోడే అవకాశం లభించింది. ఇందుకోసం బోట్లకు ఇసుక తీసే యంత్రాలను అమర్చి నదిలోకి పంపుతారు. వాటి ద్వారా నదిలో నుంచి సామర్థ్యం మేర ఇసుక తోడిన తర్వాత ఒడ్డు మీద డంప్ చేస్తారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ఇసుక కోసం దరఖాస్తు చేసుకున్న వారికి టిప్పర్ల ద్వారా సరఫరా చేయనున్నారు.

వచ్చే ఏడాది జూన్ వరకు అనుమతి..

నదిలో ఉన్న ఇసుకను కార్గో సాండ్ బోట్స్ డ్రెజింగ్ మెకానిజం పద్ధతిలో తీసేందుకు పది రోజుల క్రితం టీజీ ఎండీసీ టెండర్లు నిర్వహించింది. ఈ టెండర్ ద్వారా 7.25లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తీసేందుకు ఓ గుత్తేదారు అనుమతులు పొందారు. నదిలో నుంచి తోడిన ఇసుకను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సరఫరా చేయనున్నారు. వచ్చే ఏడాది జూన్ 21వ తేదీ వరకు ఇసుక అనుమతులు కొనసాగుతాయి. ఈ మేరకు గురువారం తుమ్మిళ్లలో ఇసుక తోడివేత ప్రారంభమైంది.

మూడు పాయింట్లు ఏర్పాటుచేశాం..

నదిలో నీరు ఉన్న సమయంలో ఇసుక లభించక ప్రభుత్వం, ప్రజలు చేపట్టిన నిర్మాణాలకు అంతరాయం ఏర్పడుతుంది. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోట్ల ద్వారా ఇసుక తోడివేతకు అనుమతులు వచ్చాయి. ఇందుకోసం తుమ్మిళ్లలో మూడు పాయింట్లు ఏర్పాటుచేశాం. సాధారణంగా ఇసుకను తీసే విధానంతో పోలిస్తే బోటు ద్వారా ఇసుకను తీయడం వల్ల ప్రకృతికి నష్టం వాటిల్లదు.

– ఆకుల శ్రీకాంత్, ప్రాజెక్టు మేనేజర్, టీజీ ఎండీసీ

సమర్థవంతంగా క్షయ క్యాంపెయిన్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్‌రెడ్డి

వనపర్తి: జిల్లాలో రెండోదశ వందరోజుల క్షయ క్యాంపెయిన్ సమర్థవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి అరాధన పట్నాయక్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. జిల్లాలో మొదటిదశ క్యాంపెయిన్ 100 శాతం పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించామన్నారు. 567 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించడమే కాకుండా వారికి చికిత్స అందించడంతో పాటు న్యూట్రిషన్ కిట్లు కూడా పంపిణీ చేసినట్లు వివరించారు. ఇందుకుగాను రాష్ట్రస్థాయిలో బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు దక్కిందని వివరించారు. అదే స్ఫూర్తితో రెండోదశ కూడా విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. వీసీలో వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు కేంద్ర బృందం రాక..

వనపర్తి: జల్‌జీవన్ మిషన్ (జేజేఎం), ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) అమలు, పురోగతిని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన 28వ కమిటీ ప్రత్యేక బృందం శని, ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందంలో నీతిఆయోగ్ డిప్యూటీ కార్యదర్శి అర్వింద్‌కుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్‌బోర్డు శాస్త్రవేత్త పి.యాదయ్య ఉన్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రానికి చేరుకొని కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారని, అనంతరం అచ్యుతాపురం, ఖాసీంనగర్‌లో పర్యటించి జల్‌జీవన్ మిషన్ అమలు, లబ్ధిదారుల స్పందన, వనరుల వినియోగం తదితర అంశాలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. 6వ తేదీన కూడా బృందం రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్–2 కెనాల్ వ్యవస్థను పరిశీలించడంతో పాటు రైతులతో సమావేశమవుతారన్నారు. సాయంత్రం నీటి పారుదలశాఖ అధికారులతో సమావేశం ఉంటుందని తెలిపారు.

బాలికల చదువు భావితరాలకు వెలుగు



విద్యార్థిని హేమమాలినికి నగదు అందజేస్తున్న జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ

కొత్తకోట రూరల్: బాలికల చదువు భావితరాలకు వెలుగునిస్తోందని.. తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ అన్నారు. గురువారం పెద్దమందడి మండలం మద్దిగట్ల, మోజర్ల ఉన్నత పాఠశాలలో 2024–25లో 10వ తరగతి ఫలితాల్లో హేమమాలిని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలువడంతో ఐకేపీ సంస్థ ప్రకటించిన రూ.25 వేల నగదు, తల్లిదండ్రులకు దుస్తులు డీఈఓ అందజేసి మాట్లాడారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ఐకేపీ సంస్థ నగదు, దుస్తులు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేస్తోందని.. 10వ తరగతి తర్వాత ఇంటర్ తప్పక చదివించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం ఎస్.వరప్రసాదరావు, ఉపాధ్యాయ బృందం, ఐకేపీ సభ్యులు, విదార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్సీ వెంటనే అమలు చేయాలి'

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి కోరారు. గురువారం సంఘం కొత్తకోటశాఖ ఆధ్వర్యంలో ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల కొత్తకోట, పాలెం, కనిమెట్ట, రామనంతపురం, నిర్వేన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రాఘవేంద్రాచారి, అరవింద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, రాములు, జిల్లా కార్యవర్గసభ్యులు ఈశ్వరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సరేందర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో కష్టపడిన వారికే పదవులు



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి తదితరులు

కందనూలు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని, కాంగ్రెస్ పార్టీ కోసం గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న యువజన కాంగ్రెస్ లీడర్లకే అవకాశం ఉంటుందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ పార్టీలో లేని స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం నేతలు కష్టపడితేనే వారికి పదవుల రూపంలో ప్రతిఫలం దక్కుతుందన్నారు. ఇందుకోసం పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ గల్లీలో పార్టీ కోసం కష్టపడితేనే ఢిల్లీలో అధికారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. యువజన కాంగ్రెస్ వల్లే తాను గెలిచినట్లు గుర్తు చేశారు. సోషల్ మీడియా వారియర్లుగా యువజన కాంగ్రెస్ లీడర్లు ఎదగాలని, అందుకు తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలన్నారు. సోషల్ మీడియానే వేదికగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని కోరారు. గ్రామాల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుపొందేలా ప్రతి కార్యకర్త పాటుపడాలని కోరారు.

క్లుప్తంగా

తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని ఎదిరలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దొడ్డి కొమురయ్య ఆత్మ బలిదానంతో దేశవ్యాప్తంగా భూ సమస్యలపై చర్చ జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో పిల్లలు కుల వృత్తితో పాటు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరి ఏదైనా నైపుణ్య శిక్షణ పొందాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని.. రాజకీయాల పేరుతో గ్రామాలను విచ్ఛిన్నం చేయరాదని, అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం రూ.50 లక్షలతో నిర్మించనున్న కురుమ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు హన్మంతు, శివశంకర్, శాంతన్నయాదవ్, నాయకులు శ్రీశైలం, జె.చంద్రశేఖర్, శివప్రసాద్‌రెడ్డి, చర్ల శ్రీనివాసులు, రాములు, బచ్చన్న, కర్నె కృష్ణయ్య, అంజి, నర్సింహులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కౌకుంట్లకు చెందిన నజీర్(25) బుధవారం రాత్రి మహబూబ్‌నగర్ నుంచి కౌకుంట్లకు వెళ్తుండగా, మాచన్‌పల్లి తండాకు చెందిన శ్రీను(30), మోహన్ కలిసి దేవరకద్ర వైపు నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ధర్మపూర్ సమీపంలో వేగంగా ఎదురెదురుగా బైక్‌లు ఢీకొట్టుకోవడంతో నజీర్ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మోహన్‌కు గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఇటిక్యాల: మండల పరిధిలోని ఉదండాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. మూడు బైక్‌లు, రూ.29,850 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బంగారు దుకాణంలో పట్టపగలే చోరీ

రాజోళి: శాంతినగర్ పట్టణంలోని ఓ బంగారు దుకాణంలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌లోని శ్రీనివాస జ్యువెలర్స్ యజమాని శ్రీనువాసులు రోజు లాగానే గురువారం ఉదయం దుకాణం తెరిచారు. వెంట తెచ్చుకున్న బ్యాగును షాపులో ఉంచి అటు వైపు తిరిగి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బ్యాగును తీసుకొని బైక్‌పై పరారయ్యారు. తేరుకున్న యజమాని కేకలు వేసే లోగా దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బ్యాగులో రూ.4 లక్షల నగదు, రెండు కిలోల వెండి ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

పీయూలో వసతుల లేమి



అభిప్రాయ సేకరణకు హాజరైన పీయూ విద్యార్థులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై విద్యాశాఖ కమిషన్ ముందు విద్యార్థులు, సిబ్బంది ఏకరువుపెట్టారు. ఉన్నత విద్యలో సమూల మార్పులు, బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో పీయూలు గురువారం పలువురి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా పలు విషయాలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.

- హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువు
- సమస్యలపై రాష్ట్ర విద్యా కమిషన్ ముందు ఏకరువు పెట్టిన విద్యార్థులు, సిబ్బంది

సెల్ఫ్ ఫైనాన్స్ ఎత్తివేయాలి..



యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ఏర్పాటు చేయడం వల్ల వారిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆ విధానాన్ని రద్దు చేయాలి. నారాయణపేటలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఆర్టీఎఫ్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి.

– రాము, విద్యార్థి సంఘం నాయకుడు

వేతనాలు పెంచాలి..



పీయూలో నాన్‌టీచింగ్ సిబ్బంది కష్టానికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో తమకు పేస్కేల్ అయినా ఇవ్వాలి. కాంట్రాక్టు అయినా చేయాలి.. లేదా రెగ్యులర్ చేసినా సంతోషమే. సిబ్బందికి ఇస్తున్న వేతనాలు పూర్తిగా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచి ఇస్తుంది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో వేతనాలు ఇవ్వాలి.

– రామ్మోహన్, నాన్‌టీచింగ్ సంఘం నాయకులు

వసతులు కల్పించడం లేదు..



పీయూలో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతుల కల్పించడం లేదు. తరగతి గదులు, ల్యాబ్స్ అనుకున్న స్థాయిలో లేవు. స్కాలర్‌షిప్‌లు రాక చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వాటిని విడుదల చేయాలి. అలాగే ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకులను నియమించి ఇబ్బందులు తీర్చాలి.

– వేణు, విద్యార్థి సంఘం నాయకుడు

హాస్టల్ విస్తరించాలి..



కొన్నేళ్లుగా బాలికలు పీయూలో చేరుతున్న సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో హాస్టల్స్‌లో చేరుతున్నారు. వారి సంఖ్యకు అనుగుణంగా విస్తరించాలి. సైన్స్ కోర్సుల్లో ఉపాధి అవకాశాలున్నా.. కొన్నింటిలో తక్కువగా ఉన్నాయి. సోషల్ సైన్స్‌లో కూడా ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి.

– నూర్జహాన్, అధ్యాపకురాలు

విలువలు ముఖ్యం..



డిగ్రీలు, పీజీలు చదివినప్పటికీ చాలా మందికి విలువలు ఉండడం లేదు. సిలబస్‌లో మార్పులు తీసుకువచ్చి విలువలతో కూడిన విద్య అందించాలి. సాంకేతికత అభివృద్ధి చెందినా సాటి మనిషిని అర్థం చేసుకునే పరిస్థితి చదువుకున్న వ్యక్తుల్లో రావడం లేదు. సైకలాజికల్ ఎమోషన్లు కంట్రోల్ చేసుకునే పరిస్థితి నేటి విద్యార్థుల్లో కొరవడింది. అందుకోసం విద్యార్థులను మానసికంగా బలంగా మార్చాల్సిన అవసరం ఉంది. – రాజశేఖర్, అధ్యాపకుడు

మెస్ ఫీజులు చెల్లించాలి..



మెస్ ఫీజులు విద్యార్థులే చెల్లిస్తున్నారు. దీంతో బాలికలకు వ్యక్తిగత ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో వారు భరించే ఖర్చులను ప్రభుత్వం కొద్దిగా ఇవ్వడంతో ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఇంగ్లిష్ మాట్లాడేందుకు క్లబ్‌లు ఏర్పాటు చేసి.. ప్రతిరోజు అందులో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలి. సీసీఈ విధానంలో క్రెడిట్స్ పెంచాలి. – మాలవి, అధ్యాపకురాలు

ఫైల్ పట్టుకుని తిరుగుతున్నారు..



యూనివర్సిటీ ప్రతినెలా జీతాలు ఇచ్చేందుకు అధికారులు నిధుల కోసం ఫైల్ పట్టుకుని సెక్రెటరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ.100 కోట్లపైనే ప్రతిపాదనలు పెడితే అందులో రూ.10 – 20 కోట్ల వరకే ఇస్తారు. అవి ఇచ్చేందుకు కూడా ఇబ్బందులే. యూనివర్సిటీలో భవనాలు విద్యార్థులు కట్టిన ఫీజులతో నిర్మించినవే.

– కుమారస్వామి, హెచ్ఓడీ, పొలిటికల్ సైన్స్

ఉపాధి అవకాశాలు కల్పించాలి..



యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా ఉండే ఇండస్ట్రీస్‌లో పీయూ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటి ఆలోచనలు చేసే విధంగా విద్యార్థుల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ఉపాధి శిక్షణలు వచ్చేందుకు నిధులు కేటాయించాలి.

– అర్జున్‌కుమార్, అధ్యాపకుడు, కామర్స్ డిపార్ట్‌మెంట్

ఉద్యోగ భద్రత కల్పించాలి..



యూనివర్సిటీ ప్రారంభం నుంచి పని చేస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. మాతో చదువుకుని గతంలో జేఎల్, డీఎల్‌గా కాంట్రాక్టు పద్ధతిలో చేరిన వారిని ప్రభుత్వం గతంలో రెగ్యులరైజ్ చేసింది. కానీ, యూనివర్సిటీలో పనిచేస్తున్న వారిని మాత్రం చేయలేదు. మా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రెగ్యులర్ చేసి.. వేతనాలు పెంచాలి.

– భూమయ్య, అధ్యాపకుడు

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ.. చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: చదువుతోనే అభివృద్ధి సాధ్యమతుందని.. గ్రామీణ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎంశ్రీ నిధులను పాఠశాలల నిర్మాణాలకు కేటాయిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.54 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మొదటి, రెండవ ఫేస్‌లో రాష్ట్రానికి రూ.4.50 లక్షల కోట్లు పీఎంశ్రీ నిధులు కేటాయించిందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధన అందిస్తారని.. కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చిన్నప్పటి నుంచే కంప్యూటర్ విద్యను అందించేందుకు ఏఐ విద్యాబోధనను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తుందని వివరించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తమవంతుగా బూట్లు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాయకులు నరహరి, ఆనంద్, శ్రీనివాస్ నాయక్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, రమణ, నసీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘నేరస్తులు ఎవరూ తప్పించుకోలేరు’



మాట్లాడుతున్న డీఎస్పీ మొగలయ్య

అయిజ: సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో పోలీసుల నుంచి నేరస్తులెవరూ తప్పించుకోలేరని డీఎస్పీ మొగలయ్య అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో జరిగిన హత్య కేసు వివరాలు వెల్లడించారు. అయిజ పట్టణానికి చెందిన సరోజ (40)కు ధరూరు మండలానికి చెందిన వడ్ల రామాచారితో 2001లో వివాహం అయ్యిందదని తెలిపారు. వారికి ఇద్దరు కుమారులు వినోద్, పవన్, కూతురు వైష్ణవి ఉన్నారన్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండడంతో విడాకులు తీసుకున్నారని తెలిపారు. 2012లో రామాచారి రెండో వివాహం చేసుకున్నాడని, అప్పుడప్పుడు వచ్చి మెదటి భార్య ద్వారా కలిగిన సంతానాన్ని చూసి వెళ్లేవాడని పేర్కొన్నారు. అయితే మెదటి భార్య సరోజ ప్రవర్తన సరిగా లేదని, వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని, దాంతో మొదటి కుమారుడికి ఎవరూ అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేయడం లేదని రామాచారి భావించాడు. ఈ నెల 1 న అయిజకు చేరుకొని తన పెద్ద కొడుకు వినోద్‌తో కలిసి సరోజ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గాయపరిచి ప్రాణాలు తీశారని వివరించారు. మృతురాలి తమ్ముడు వడ్ల నరసింహాచారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో సీఐ టాటా బాబు, ఎస్‌ఐ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కేఎస్పీలో 22 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో గురువారం 22 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల నుంచి ఒక పంపు నడుపుతూ నెలరోజులుగా నీటి తరలింపు కొనసాగుతుందని చెప్పారు. మరో 4.6 అడుగుల నీరు చేరితే పాత అలుగుస్థాయికి చేరుతుందని వివరించారు.

జడ్చర్లలో డెంగీ కేసు నమోదు



బాధితుడి ఇంటి వద్ద మున్సిపల్ కమిషనర్, వైద్యాధికారి, చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటపతిరావు కాలనీలో నివాసముంటున్న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి డెంగీ బారిన పడ్డాడు. పోలేపల్లి ఫార్మసెజ్‌లోని హెటిరో కంపెనీలో పనిచేస్తున్న పరశురాం అనే వ్యక్తికి బుధవారం డెంగీ నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. అయితే డెంగీ సోకినట్లు తెలియగానే బాధితుడు స్వగ్రామానికి బయలుదేరి వెళ్లాడు. గురువారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా.మను ప్రియలు బాధితుడు నివాసం ఉంటున్న ఇంటిని సందర్శించారు. మున్సిపల్ వైద్య ఆరోగ్యశాఖ రాపిడ్ రెస్పాన్స్ టీం ద్వారా యాంటి లార్వాల్, యాంటి మస్కిటో నివారణ చర్యలు చేపట్టారు. పరిసరాల్లోని 100 ఇళ్లల్లోనూ అవగాహన కల్పించారు.బాధితుడి ఇంటితో పాటు పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల మందును ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మిక సమస్యలను పరిష్కరించాలని జెన్‌కో 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకర లవకుమార్ కోరారు. ఈ మేరకు గురువారం కేంద్రం సీఈ కేవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆర్టిజన్లు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారిని దృష్టిలో ఉంచుకొని పనిఒత్తిడి తగ్గించాలని వివరించారు. రొటేషన్ పద్ధతిలో జనరల్‌లో విధులు నిర్వహిస్తున్నవారిని షిఫ్టుకు, షిఫ్టుకు వారిని జనరల్‌కు ఇంటర్నల్ ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. జీఐఎస్ ప్రాంతంలో వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని వివరించారు. జెన్‌కో కాలనీలో విద్యుత్తు ఉద్యోగుల నివాస కాలనీలో ఉన్న ఇళ్లకు మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారత్‌మాల రోడ్డుపై రైతుల ధర్నా



భారత్‌మాల రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

అయిజ: మండలంలోని దేవబండ గ్రామ రైతులు గురువారం భారత్‌మాల రోడ్డుపై టెంట్ వేసుకొని ధర్నా నిర్వహించారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు మూడో విడత నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన తమకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని పైప్‌లైన్‌లు, చెట్లు తదితర వాటికి వెంటనే నష్టపరిహారం కోరారు. తమకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించేంత వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు.

రూ.7.43 లక్షలు మాయం

గద్వాల క్రైం: ముగ్గురి ఖాతాల నుంచి రూ.7.43 లక్షలు మాయమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు ఆర్జించవచ్చని పట్టణానికి చెందిన ముగ్గురి వ్యక్తులకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఇది నమ్మి బ్యాంక్ సంబంధించి ఖాతా వివరాలు తెలిపగా ఒక్కొక్కరి ఖాతా నుంచి రూ.40,270, రూ.50,000, రూ.6,53,000 మొత్తం 7,43,270 లక్షలు తస్కరించారు. వెంటనే వారి అకౌంట్‌లో ఉన్న డబ్బులు మాయమయ్యాయి. బాధితులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930కు సమాచారం అందించాలన్నారు. త్వరలో నిందితులను గుర్తించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ సెక్రటరీ తిరుపతయ్య

స్టేషన్ మహబూబ్‌నగర్: 2012లో ఎల్‌ఐసీలో నియామకమైన ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్‌సెంట్రల్ జోన్ బీమా ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ తిరుపతయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్‌ఐసీలో ఎఫ్‌డీఐలను 100 శాతం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌డీఐని ఇండియాలోకి తీసుకురావడం వల్ల చాలా ప్రైవేట్ కంపెనీలు పుట్టగొడుగుల్లా వస్తాయని అనుకున్నారని, కేవలం 25 కంపెనీలు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. బీమాలా అమెండ్‌మెంట్ బిల్లును ఈ వర్షకాలంలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదన్నారు. ఈ బిల్లును కూడా పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈనెల 9న జరిగే అఖిల భారత సమ్మెలో ఆలిండియా బీమా ఉద్యోగులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో బీమా కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, డివిజన్ ఉపాధ్యక్షులు రాజేశ్వర్, మహబూబ్‌నగర్ బ్రాంచీ కార్యదర్శి కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘వైస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించండి’



కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శి భాస్కర్‌పై అకారణంగా చేయి చేసుకున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి తన మాట వినాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. ప్రజాప్రతినిధిగా అధికారులకు సహకరించాల్సింది పోయి దాడికి పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. వీరికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం కూడా మద్దతు తెలిపింది. కాగా ఈ వ్యవహారంపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. దాడికి పాల్పడ్డ సమయంలో ఎవరున్నారు.. సీసీ కెమెరాలు ఉన్నాయా.. లేదా, ఉంటే అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేయాలని చెప్పినట్లు సమాచారం. దాడి ఘటనపై ఎస్పీతో పాటు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని కలెక్టర్ ఉద్యోగ సంఘం నాయకులకు భరోసానిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, ఉపాధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, సహాయ కార్యదర్శి మల్లయ్య, వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, టీజీఓల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, కోశాధికారి టైటాస్‌పాల్, ఏఎంసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకట్రాములు, శ్రీశైలం ఉన్నారు.

విత్తన పత్తి..!

మొదటి పేజీ తరువాయి

ఇతర ప్రాంతాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగవుతోంది. అయితే ఈ పంట సాగుకు ఖర్చు ఎక్కువ. ఈ క్రమంలో పెట్టుబడి అవసరాలను ఆసరాగా చేసుకుని రాజకీయ నాయకులే సీడ్ ఆర్గనైజర్లుగా మారగా.. ఈ వ్యవస్థ ప్రస్తుతం రైతుల భవిష్యత్‌ను శాసిస్తోంది. సీడ్ పత్తి సాగుదారులకు పెట్టుబడి అందిస్తూ వచ్చిన వారు దోపిడీకి తెగబడ్డారు. రైతుల నుంచి సీడ్ పత్తిని సేకరించి కంపెనీలకు అప్పగించడం.. వారు చెల్లించిన డబ్బులను రైతులకు చెల్లించడంలో మోసాలకు తెరలేపారు. విత్తనాలను తమకే విక్రయించాలనే నిబంధనతో పెట్టుబడి కింద ఇచ్చిన మొత్తాన్ని రూ.100కు రూ.2 నుంచి రూ.5 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. విత్తనాలు ఫెయిల్ కాకున్నా.. అయ్యాయని, నాణ్యత లేదని రైతులను నిలువునా ముంచుతున్నారు. తొలుత 40 మంది వరకు మాత్రమే ఆర్గనైజర్లు ఉండగా.. సబ్ ఆర్గనైజర్లతో కలిపి 300 మంది వరకు దందా నడిపిస్తున్నారు.

తాజాగా సీలింగ్ మెలిక..

కంపెనీలు సీలింగ్ పెట్టాయంటూ సీడ్ ఆర్గనైజర్లు ఎకరాకు 200 పాకెట్ల విత్తనాలను మాత్రమే కొంటామని తాజాగా మెలిక పెట్టడం సాగుదారుల్లో అలజడి సృష్టిస్తోంది. విత్తనాలు పెట్టి నెల దాటగా వేసిన పంటను తొలగిస్తే ఎకరాకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు ఇస్తామని ఆర్గనైజర్లు చెబుతున్నారని.. కానీ ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి అయిందని వాపోతున్నారు. ఇతర పంటలు వేసే కాలం అయిపోయిందని.. ఎకరాకు ఉత్పత్తయ్యే సీడ్ మొత్తాన్నీ తీసుకోవాల్సిందేనని..



గద్వాల జిల్లా మల్దకల్‌లో మొక్కల దశలో ఉన్న సీడ్ పత్తిని మేకల మేతగా వదిలేసిన దృశ్యం

లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కాగా, సీలింగ్ నేపథ్యంలో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

గడువులోపు డబ్బులివ్వరు.. వడ్డీ మాత్రం వసూలు

సీడ్ పత్తి కంపెనీలు ఏటా మేలో రైతులకు ఫౌండేషన్ సీడ్స్ అందజేస్తున్నాయి. పంట చేతికొచ్చిన తర్వాత రైతులు డిసెంబర్‌లో ఆర్గనైజర్ల ద్వారా కంపెనీలకు విత్తనాలు ఇస్తున్నారు. గ్రోత్ ఔట్ టెస్ట్ (జీఓటీ)లో పాస్ అయిన విత్తనాల డబ్బులు నాలుగైదు నెలల తర్వాత రైతులకందుతున్నాయి. అయితే పెట్టుబడికి తీసుకున్న మొత్తంపై ఈ కాలానికి సంబంధించిన వడ్డీని రైతులు చెల్లించాల్సి వస్తోంది. ఎప్పుడూ ఏప్రిల్, మేలో కంపెనీలు ఆర్గనైజర్ల ద్వారా విత్తన డబ్బులను చెల్లిస్తుండగా.. ప్రస్తుతం ఇప్పటివరకు రాలేదు. గద్వాల జిల్లాలో గత ఏడాది సీడ్ పత్తి సాగుదారులకు చెల్లించాల్సిన రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉండగా.. వారు ఆర్గనైజర్ల చుట్టూ తిరుగుతున్నారు.

రైతు సంక్షేమ కమిషన్‌పై తిరుగుబాటా?

ఇటీవల రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గద్వాల జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో సీడ్ పత్తి సాగు పంటను పరిశీలించిన ఆయన జిల్లా కలెక్టరేట్‌లో రైతులు, కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీడ్ పత్తి సాగుదారులకు జరుగుతున్న అన్యాయంపై రైతులతో పాటు పలు సంఘాలు ఆయన దృష్టికి తీసుకొచ్చాయి. అప్పుడు, ఆ తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీడ్ ఆర్గనైజర్ల తీరుపై కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న విత్తన చట్టాన్ని ఉల్లంఘిస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. త్వరలో నూతన విత్తన చట్టం తీసుకొస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమకు ఇబ్బందులు తప్పవని యోచించిన ఆర్గనైజర్లు కొత్త ఎత్తుగడకు దిగినట్లు తెలుస్తోంది. రైతులను ఇబ్బంది పెట్టేలా సీలింగ్‌కు తెరలేపడంతోపాటు రైతు కమిషన్ హెచ్చరికలకు బెదిరేది లేదనే సంకేతాన్ని పంపించినట్లు రైతు సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా మాఫియాగా మారిన ఆర్గనైజర్ల వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నాయి.

ఇంకా రూ.2.50 లక్షలు రావాలి..



గత ఖరీఫ్‌లో నాకున్న 3 ఎకరాల్లో వేద రాయల్ సీడ్స్ కంపెనీ పత్తి సీడ్ పంట సాగు చేశాను. మొత్తం 11.40 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. రూ.4 లక్షలు పెట్టుబడికి వాడుకున్నా. ఇవి పోను లెక్క చేసిన రూ.2.50 లక్షలు నాకు రావాల్సి ఉంది. ఆ డబ్బులను ఆర్గనైజర్ ఇప్పటివరకు ఇవ్వలేదు. డబ్బులడిగితే విత్తనాలు ఫెయిల్ అయ్యాయని చెబుతున్నాడు. కంపెనీ దగ్గర చెక్ చేస్తే పాస్ అయినట్లు ఉంది. ఏం చేయాలో తోచడం లేదు.

– జయప్ప, ఇర్కిచేడు, కేటీదొడ్డి